జాయింట్ కలెక్టర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ గురువారం విస్తృతంగా పర్యటించారు. వంకసోమిద గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను, గ్రౌండ్ ట్రూ తింగ్ ను పరిశీలించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్ల తమ్మిరాజుపేట రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. విత్తన పంపిణీని ప్రారంభించారు. రైతులతో భేటీ అయి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆంద్ర జిల్లా పరిషత్ పాటశాలను సదర్శించారు. నాడు-నేడు పనులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పంపిణీకి సిద్దంగా ఉన్న పుస్తకాలను తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి, వారి సమస్యలు, ఉపాధ్యాయుల బోధన గురించి తెలుసుకున్నారు. పర్యటనలో తహశీల్దార్ కె.రామకృష్ణ, ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఎఒ గోకులకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అలజంగి ఉపసర్పంచ్ లక్ష్మనాయుడు ఆత్మహత్యాయత్నం

అభివృద్ధి పనులకు బిల్లులు అవ్వకపోవడం

ఎమ్మెల్యే గౌరవం ఇవ్వడం లేదని మనస్తాపం

బాధితుడి జేబులో లేఖ లభ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని అలజంగి వైసిపి ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మనాయుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్నారు.

గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు అవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు, వైసిపి కోసం ఎంత పని చేసినా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గుర్తింపు ఇవ్వకుండా ప్రజల ముందు అవమానిస్తున్నారనే కారణంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి సెగ్మెంట్‌ను ఎస్‌సిలకు కేటాయించారు. పంచాయతీ ఎన్నికల్లో ఎస్‌సి అభ్యర్థిని గెలిపించేందుకు పని చేసి వార్డు మెంబర్ గా పోటీ చేసి ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేసినప్పటికీ బిల్లులు అవ్వడం లేదని చర్చ జరుగుతోంది. ఎన్నికలకు చేసిన అప్పులు తీరకపోవడం, బిల్లులు అవ్వకపోవడంతో ఒత్తిడి పెరిగి సోమవారం తెల్లవారుజామున పురుగులమందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్నారు. అపస్మారక స్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం ఎన్. ఆర్.ఐ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన జేబులో సంతకం లేని లేఖ లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు- నేడు పనులకు గ్రహణం

- రెండోదశలో రూ. 231.24 కోట్లతో పనులు
- ఏడాదిన్నరలో ఇచ్చింది రూ.73 కోట్లే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన 'నాడు-నేడు' పథకం నిధుల కొరతతో పడకేసింది. ఈ పథకంలో రెండోదశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. పేరుకు ప్రతిష్టాత్మక పథకమే అయినా నిధుల విడుదలలో మాత్రం ఈ పథకం చిట్టచివరన నిలవడంతో చాలాచోట్ల పనులు ఆగిపోయాయి. ఏడాదిన్నర కిందట ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రెండో విడత పనులకు శ్రీకారం చుట్టారు. 2022 జూలై నాటికి పనులు పూర్తిచేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే పరిపాలనా అనుమతులు ఇచ్చేందుకే సుమారు ఏడాది సమయం పట్టింది. ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులతో పనులు చేసిన ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీలు రావాల్సిన నిధులు కోసం కోసం ఎదురు చూస్తున్నారు. 2023 విద్యా సంవత్సరం ప్రారంభమైనా నేటికీ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నాడు- నేడు పనులు ఉన్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం జూన్ నెల చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ కేవలం 30 శాతం పనులు మాత్రమే జరిగాయి. 737 పాఠశాలల్లో రూ.231.24 వేల కోట్ల అంచనాతో రెండోదశ పనులను 2021 ఆగస్టులో ప్రారంభించారు. ఏడాదిన్నర దాటిపోయినా ఇప్పటివ రకూ విడుదల చేసిన నిధులు కేవలం రూ.73 కోట్లే, మిగిలిన నిధుల విడుదలకు ఎంతకాలం పడుతుంది తెలియని పరిస్థితి కనిపిస్తోంది.

విజయనగరంలో మధ్యలో నిలిచిపోయిన పాఠశాల భవనం

విద్యా సంవత్సరం ప్రారంభమైంది. 30 శాతం పనులు చేయడానికి రెండేళ్ల పట్టింది మిగిలిన 70 శాతం పనులు ఎప్పటికీ పూర్తి చేస్తారో పాలకులే చెప్పాలి. మొత్తం 9 రకాల 700 పనులు విద్యుత్, ప్రహరీగోడలు, తాగునీరు, మరుగుదొడ్లు, మరమ్మత్తులు, అదనపు తరగతి గదులు వంటి వాటి కోసం ఖర్చు చేయాల్సి ఉంది. మొత్తం పనుల్లో ఇప్పటి వరకు కేవలం రూ.73కోట్ల ఖర్చుతో 101 పనులు మాత్రమే పూర్తయ్యాయి. నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిల్చిపోయాయి.ఇటీవల మెటీ రియల్ ధరలు భారీగా పెరిగిపోవడంతో ప్రభుత్వం అరకొరగా ఇస్తున్న నిధులు ఏమూలకూ సరిపోవడం లేదు. జిల్లా కేంద్రంలోని బాబామెట్ట, బిపిఎం స్కూల్, సాంస్కృతిక పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలోని పనులు నిధులు విడుదల కాకపోవడంతో నిలిచిపోయాయి. మొదటి విడతగా 30 శాతం నిధులు విడుదల కావడంతో అంత వరకు పనులు చేశారు. తరువాత నిధులు విడుదల కాకపోవడంతో మిగిలిన పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. ఇలా జిల్లాలో 737 స్కూళ్ళలో ఇదే పరిస్థితి నెలకొంది. ఎప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందో,ఎప్పటికీ రెండో విడత నాడు నేడు పనులు పూర్తి అవుతాయోనని ప్రధానోపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు.

జిల్లాపై మంత్రి బొత్స ప్రత్యేక దృష్టి

- పెరుగుతున్న రాకపోకలు
- పార్టీని మరింత పటిష్టపరిచే చర్యలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాపై ఇటీవల కాలంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇటీవల జిల్లాకు రాకపోకలు పెరగడం, వచ్చిన సందర్భాల్లో ఎక్కువ సమయం ఉండడం, ఉన్న సమయంలోనూ క్షేత్ర స్థాయి పర్యటనలు, ఇంటివద్ద నాయకులు, కార్యకర్తలకు మరింత సమయం కేటాయించడం ఇందుకు ఉదాహరణ అని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇటు పరిపాలన, అడ్మినిస్ట్రేషన్ విషయంలోనూ చొరవగా ఉంటున్నారన్న చర్చనడుస్తోంది. వాస్తవానికి మంత్రి బొత్సకు జిల్లాలోని రాజకీయాలు, పార్టీని ఏకతాటిపై నడపడం కొత్తేమీ కాదు. ప్రభుత్వ కార్యకలాపాలు నడపడంలోనూ ఆరితేరారు. రాష్ట్ర మంత్రి బాధ్యతలతోపాటు రాష్ట్ర రాజకీయ వ్యవహారాల వల్ల ఎక్కువ సమయం రాష్ట్ర రాజధాని, ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్న విషయం విధితమే. సుమారు నాలుగు దశాబ్దాలుగా అప్పటి కాంగ్రెస్‌లో గానీ, ఇప్పటి వైసిపిలోగాని జిల్లాలో బొత్స చెప్పిందే వేదంగా నడుస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతోపాటు వైసిపిలో చాపకింద నీరులా రాజకీయ విన్యాసాలు చోటు చేసుకోవడంతో వాటిని మొగ్గలోనే తుడిచేసేందుకు జిల్లాలో అధిక సమయం కేటాయిస్తున్నారని పలువురు రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా వచ్చే ఎన్నికలే లక్ష్యంగా జిల్లాకు చెందిన ఓ కీలకనేత, ఒకరిద్దరు ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నట్టు వార్తలు వస్తుండడంతో మంత్రి అప్రమత్తమయ్యారనే చర్చనడుస్తోంది. అందులో

భాగంగానే ఇటీవల జిల్లాకు తరచుగా వస్తున్నారు. జిల్లాలో కీలక నాయకులకు సమాచారం ఎప్పటికప్పుడు చేరుతోంది. గురువారం జిల్లాకు వచ్చిన బొత్స రెండు రోజులు పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీబిజీగా ఉన్నారు. గతంలో జిల్లాకు ఉదయం వస్తే రాత్రికి తిరిగి రాజధాని లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయే వారని, కొన్నాళ్లగా స్థానికంగా ఉండేందుకు ప్రాధాన్యతనిస్తున్నారని పార్టీలో చర్చనడుస్తోంది. ఈ వైఖరితో పార్టీలో అంతర్గత విభేధాలు, పెదదోరణలు చక్కదిద్దేందుకు దోహదపడుతుందని కూడా చర్చనడుస్తోంది. ఇప్పటికే కొన్ని విషయాల్లో రాజకీయ సిఫార్సులకు కొందరు నేతలు సాహశించలేక పోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు జిల్లాలో ప్రతిపక్ష పార్టీ ఎత్తులకు మంత్రి బొత్స పైఎత్తులు కూడా ప్రారంభమయ్యాయని పలువురు చెబుతున్నారు.

రూమ్‌కు తాళం వేసిన ఎంఇఒతో ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీచైతన్యలో పుస్తక విక్రయాలు అడ్డగింత

ఎస్ఎఫ్ఐ ధర్నాతో పుస్తకాల రూమ్‌ను సీజ్ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగర పట్టణంలో అయ్యన్నపేట జంక్షన్‌లో గల శ్రీ చైతన్య హైస్కూల్ లో పుస్తకాలు, యూనిఫాం పేరుతో వేలకు వేలు ఫీజులు వసూలు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం అడ్డుకున్నారు. పుస్తకాల గదిని సీజ్ చేయాలని అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల పరిధిలో ఎటువంటి అమ్మకాలు చేయకూడదని ఉన్నా సరే ఇటువంటి పాఠశాలలు అన్యాయంగా వేలకు వేలు వసూలు చేయడం దుర్మార్గం అన్నారు. వీటిని పట్టించుకోవాల్సిన ప్రభుత్వం కళ్ళు మూసుకుపోయి వ్యవహరిస్తుందని అన్నారు. పాఠశాలలో మూడవ తరగతి పిల్లవాడికి 8 వేల రూపాయలు వసూలు చేయడం చూస్తే ఇది విజ్ఞానాన్ని పంచె పాఠశాల లేక విద్యార్థుల రక్తాన్ని ధనం రూపం లో పీల్చే కార్పొరేట్ జలగో అర్థం కావట్లేదని విమర్శించారు. అనంతరం ఎస్ ఎఫ్ ఐ ఆందోళనతో అక్కడికి వచ్చిన ఎంఇఒ పివిబిఆర్ రాజు అక్కడికి చేరుకొని పుస్తకాలు, యూనిఫామ్ గదిని సీజ్ చేశారు. భవిష్యత్తు లో యాజమాన్యం పుస్తకాలు అమ్మకుండా చూస్తామని ఎంఇఒ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.సౌమ్య , జె.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హర్ష , జిల్లా కమిటీ సభ్యులు రమేష్ ,సమీర, నాయకులు జగదీశ్ ,సోమేశ్ , వెంకటరణ పాల్గొన్నారు.

ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు

- ప్రతి మండలానికి రెండో ఎంఇఒ పోస్టు
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే జగనన్న ఆణిముత్యాలు పేరుతో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి నియోజకవర్గ స్థాయిలో ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాల దశ నుంచే జీవితంలో తాను సాధించదలచిన లక్ష్యాలను ఏర్పరచు కోవాలని కోరారు. జిల్లా స్థాయిలో ఈనెల 17వ తేదీన ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు నగదు పారితోషికంతో సత్కరిస్తామని, 20న రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రంలో 6వ తరగతి నుంచే విద్యార్థులకు డిజిటల్ విద్యను అందిస్తున్నామని, దీనిలో భాగంగా అన్ని స్కూళ్లలో ఇంటరాక్టివ్ లెర్నింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ప్రతి మండలానికి రెండో మండల విద్యాధికారిని నియమిస్తున్నామని చెప్పారు. నాడు-నేడు కింద పనులు పూర్తయిన పాఠశాలల్లో వాచ్‌మెన్‌ల నియామకాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ని మంత్రి కోరారు. మధ్యాహ్న భోజనం వర్కర్ల కుటుంబాలకు చెందిన వారు, గ్రామంలోని మాజీ సైనికులకు వాచ్‌మెన్ నియామకంలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపొందించడంలో ముఖ్యమంత్రి కృషికి ఉపాధ్యాయులు కూడా తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే పిల్లలకు విద్యాకానుక కిట్లను అందించడంతోపాటు పాఠశాలలో వసతులు, మంచి పౌష్టికాహారం అందిస్తున్నదని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో బాగా రాణించాలన్నారు.

యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

చీపురుపల్లి నియోజకవర్గ స్థాయిలో జూన్ 9న నిర్వహించిన మెగా జాబ్ మేళా సందర్భంగా వివిధ సంస్థల్లో ఎంపికైన పలువురు యువతకు మంత్రి

డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

నియామక పత్రాలు అందజేశారు. ఈ జాబ్‌మేళాలో 685 మంది యువతీ యువకులు వివిధ పారిశ్రామిక వాణిజ్య సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఎపి స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎన్.గోవిందరావు తెలిపారు.కార్యక్రమంలో డిఇఒ లింగేశ్వర రెడ్డి, ఆర్‌డిఒ అప్పారావు, తహశీల్దార్ సురేష్ కుమార్, ఎంపిడిఒ, స్థానిక నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

మార్కెట్ కమిటీ నూతన కార్యాలయ భవనం ప్రారంభం

గరివిడి మండలం కోడూరు వద్ద రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. రూ.16లక్షలతో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దన్నాన జనార్దనరావు, కార్యదర్శి ఎన్.భువనేశ్వరి, గరివిడి తహశీల్దార్ టి.గోవింద, చీపురుపల్లి తహశీల్దార్ సురేష్ కుమార్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం వద్ద రోధిస్తున్న స్నేహితుడు

వడదెబ్బతో యువకుడు మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలి నుంచి విజయనగరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వడదెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విజయనగరానికి చెందిన అదపాక మల్లికార్జునరావు (28) తన స్నేహితుడు, ఏడు సంవత్సరాల బాలుడితో కలిసి పర్లాకిమిడి నుండి ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామం విజయనగరం వస్తుండగా వడదెబ్బకు గురయ్యాడు. ఎండ వేడికి కళ్లు తిరుగుతున్నాయని తన స్నేహితుడితో చెప్పి వాహనం ఆపమని చెప్పాడు. తాగునీరు కావాలని దాహం కేకలు వేయడంతో వెంటనే స్నేహితుడు సమీపంలో ఉన్న కుమిలి గ్రామానికి వెళ్ళాడు. నీరు పట్టుకుని వచ్చేలోపునే మల్లికార్జునరావు మృతి చెందాడు. స్నేహితుడు సిఆర్‌పి చేసినా ప్రయత్నాలు ఫలించలేదు. ఇంతలో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అతను చనిపోయాడని నిర్ధారించారు. మృతుడికి నెల రోజులు ముందే పెళ్లి జరిగింది. అత్తవారింటికి వెళ్లి వస్తుండగా ఇలా జరిగిందని బోరున ఏడుస్తూ అతని స్నేహితుడు కన్నీరుపెట్టాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోజువారీ కంటిపరీక్షలు పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వైఎస్ఆర్ కంటివెలుగు కార్యక్రమంలో రోజువారీ కంటిపరీక్షలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ నేత్రవైద్య సహాయకులను ఆదేశించారు. కంటి పరీక్షలు చేయడంలో గ్రామ, వార్డు వలంటీర్లు సహకరించేలా ఆదేశాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే కంటిపరీక్షలు పూర్తయిన వారికి కళ్లద్దాల పంపిణీని త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమంపై సమీక్షిస్తూ జిల్లాలో కంటివెలుగులో గుర్తించిన 5 వేల మందికి నిర్దిష్ట వ్యవధిలో చికిత్సలు చేసేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించి తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు పూర్తిచేయాలని ఆదేశించారు. కళ్లద్దాల పంపిణీలో వైద్యాధికారుల సహకారం అందించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. కంటి చికిత్సలు చేయించుకొనే వారికి రవాణా సౌకర్యాలు కల్పించినట్లయితే మరింత ఎక్కువ మందికి చేయడం సాధ్యమవుతుందని పుష్పగిరి, శంకర్ ఫౌండేషన్ తదితర ఆసుపత్రుల ప్రతినిధులు వివరించారు. జిల్లాలో కంటివెలుగు కార్యక్రమంలో సాధించిన ప్రగతిని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివప్రసాద్ వివరించారు. జిల్లాలో 8 బృందాల ద్వారా కంటి తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో డిఎంహెచ్ఒ భాస్కరరావు, కంటివెలుగు అధికారి తారక్, పలు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

విజయనగరం కోట :విజయనగరం ఆర్‌టిసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం శుక్రవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులందరూ ఎటువంటి సమస్యలున్నా ఫోన్ ద్వారా తెలిపి నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు. సమస్యలపై డిపోమేనేజర్ 9959225620, ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

'సత్య' కు రెడ్ క్రాస్ ప్రత్యేక గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని, సత్యా విద్యాసంస్థలు చేసిన రక్తదాన సేవలకు గుర్తింపుగా రెడ్ క్రాస్ సంస్థ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. సత్యా విద్యాసంస్థల సేవకు గుర్తింపుగా జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యా విద్యా సంస్థల సంచాలకులు డాక్టర్ మజ్జి భూషణ్ రావు , సత్య డిగ్రీ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ సత్యవేణి, సీతం కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ వరలక్ష్మిని, ప్రశంసా పత్రం జ్ఞాపిక ల తో సన్మానించారు.

టూరిస్ట్ ట్రైన్ ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

భారత్ గౌరవ టూరిస్ట్ ట్రైన్ ను యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ సౌత్ సెంట్రల్ జోన్ ఐఆర్‌సిటిసి ఏరియా ఆఫీసర్ చంద్ర మోహన్ బిసా కోరారు. గురువారం స్థానిక విజయనగరం రైల్వే స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్రైన్ 3 తేదీల్లో బయలు దేరుతుందన్నారు. ఈనెల 28న బయలుదేరి జూలై 6న తిరిగి వస్తుందన్నారు. మరొకటి జూలై 12 బయలుదేరి జూలై 20న తిరిగి వస్తుందని, జూలై 26 బయలుదేరి ఆగస్టు 8న తిరిగి చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు ప్రయాణాలు 8 రాత్రులు, తొమ్మిది పగలు ఉంటాయన్నారు పెందుర్తి, విజయనగరం రైల్వే స్టేషన్ల నుంచి బయలు దేరుతాయని తెలిపారు. ఇక్కడి నుంచి నేరుగా పూరి వెళ్లి ఊరిలో హనుమాన్ జయంతి టెంపుల్ కోణార్క్ సూర్యదేవాలయం, గయాలో పిండ ప్రధాన్, విష్ణు పద్మ టెంపుల్, వారణాసిలో కాశి విశ్వనాధ్ టెంపుల్, కాశీ విశాలాక్షి టెంపుల్, మాతా అన్నపూర్ణేశ్వరి దేవి టెంపుల్ గంగా హారతి సందర్శన ఉంటాయని తెలిపారు. ప్రయాగరాజు లో త్రివేణి సంగమం, హనుమాన్ మందిర్, శంకర్ విమెన్ మండపం చూపిస్తారన్నారు. ఆయా స్టేషన్లో దిగిన తర్వాత ఐ ఆర్ సి టి సి వారు ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన బస్సుల్లో తీసుకువెళ్లి వారిని ఆయా ప్రదేశాలు దర్శించిన అనంతరం తిరిగి అదే బస్సుల్లో స్టేషన్లకు తీసుకువస్తామని తెలిపారు.. స్లీపర్ క్లాస్ లో ఒక మనిషికి రూ.15,0 75, థర్డ్ ఎసి రూ.23,8 75, టూ టైర్ ఎసి రూ.31,250 , ఐదు నుంచి 11 సంవత్సరాల పిల్లలకు స్లీపర్ లో రూ.14,070, థర్డ్ ఎసి రూ.22,695, టూ టైర్ ఎసి రూ.29,840 గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు చందన్ కుమార్ 8287932318, ఎస్ విశాలాక్షి 9701085461 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం రైల్వే స్టేషన్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రసాద్, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ రవికాంత్ పాల్గొన్నారు.

తోటపల్లి కాలువకు మూడుచోట్ల గండ్లు

వృథాగా పోతున్న సాగునీరు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని అలజంగి సమీపంలో తోటపల్లి కుడికాలువకు మూడుచోట్ల గండ్లు పడ్డాయి. ఖరీఫ్ సాగుకు రైతులకు ముందస్తుగా సాగునీరు అందించేందుకు ఈనెల 12న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు కలిసి తోటపల్లి కుడి కాలువ నీటిని విడుదల చేశారు. తోటపల్లి కుడి కాలువ ద్వారా నీరు ఉమ్మడి జిల్లాలో పలు మండలాల రైతులకు అందుతుంది. ఈనెల 12న నీరు విడుదల చేయడంతో అలజంగి వద్దకు బుధవారం చేరుకుంది. గతంలో అలజంగి వద్ద కాలువకు గండ్లు పడ్డాయి. వాటిని ఇరిగేషన్ అధికారులు తూతుమంత్రంగా పూడ్చడం, బుధవారం కాలువ నుంచి ఉధృతంగా సాగునీరు ప్రవహించడంతో మూడు చోట్ల గండ్లు పడ్డాయి. మూడు చోట్ల గండ్లు పడడంతో కాలువ కింద ఉన్న భూములు జలమయమయ్యాయి. సాగునీరు వృథాగా పోవడంతో రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గండ్లను పూడ్చాలని కోరారు.

ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం

తోటపల్లి కుడి కాలువ నీరు విడుదల చేసిన తర్వాత



అలజంగి వద్ద గండిపడిన తోటపల్లి కాలువ

నీరు ఎలా ప్రవహిస్తుందో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. అలజంగి వద్ద మూడు చోట్ల గండ్లు పడిన గుర్తించలేదు అంటే అధికారులు పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువకు పడిన గండ్లను పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

ఆర్అండ్‌బి ఉద్యోగుల జిల్లా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

ఆర్అండ్‌బి శాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ అధ్యక్షులు ప్రాపారావు అధ్యక్షత వహించారు. ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్‌లు, జిల్లాల ఏర్పాటులో ఉద్యోగులకు జీతాలు సమస్యలు, వాటిపరిష్కార మార్గాలపై చర్చించారు. వాటి పరిష్కారానికి సంఘం చేస్తున్న కార్యాచరణను తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శి వైఆర్ అనీల్ కుమార్, నాయకులు శ్రీనివాసరావు, జోగారావు , రమణ, సింహాచలం, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్ రావు, థెరీసమ్మ, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

నాడు-నేడు పనులు వేగవంతం

వంగర: నాడు నేడు పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న చిన్న చిన్న పనులు అలాగే పెద్ద పనులు ఏ విధంగా చేయాలనే దానిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కి సూచనలు ఇచ్చారు.

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఎంపిడిఒ పట్నాయక్ గురువారం పరిశీలించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో మండల పరిషత్ ఇంజినీరింగ్ అధికారి అలీ, పంచాయతీ కార్యదర్శులు నాగమణి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, సిఆర్పి కాటుపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.

మేజర్, మైనర్ సబ్జెక్ట్ విధానాన్ని రద్దు చేయాలి

శృంగవరపుకోట: డిగ్రీ విద్యలో తీసుకొచ్చిన మేజర్, మైనర్ సబ్జెక్ట్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కొర్రా రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కొర్రా రమేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను గురువారం ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించి, సమస్యలపై సర్వే చేసిందన్నారు. అనంతరం సమస్యలపై డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రం ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హఠాత్తుగా డిగ్రీ విద్యలో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పుకుంటూనే, విద్యార్థులను డిగ్రీ విద్యకు దూరం చేస్తుందన్నారు. ఈ సంవత్సరం నుంచి డిగ్రీలో మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానం తీసుకొచ్చిందని దీని వల్ల విద్యార్థికి డిగ్రీ విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. ఈ విధానం వల్ల విద్యార్థి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

కొత్తవలస: సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జిఎస్ఎన్ రాజు 70వ పుట్టినరోజు వేడుకలు కొత్తవలసలోని శ్రీ వాగ్దేవి కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కోట్ని మహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏఎస్ రాజా బ్లడ్ బాంక్ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీసీ చేతులమీదుగా ప్రారంభించారు. రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఆయన అన్నారు. ముందుగా కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అనంతరం వీసీని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది, జ్ఞాపికను అందజేశారు. కుమ్మరిబంజి వద్దనున్న ట్రినిటీ చారిటబుల్ ట్రస్ట్‌లోని అనాధ చిన్నారులకు పుట్టినరోజు సందర్భంగా మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ బాబు, అమరావతి పాఠశాల, వాగ్దేవి కళాశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాలన్నీ ఎ-గ్రేడ్‌లో ఉండాలి

గుర్ల: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షులు బి.సత్యవమ్మ అధ్యక్షతన మండల సమాఖ్య సాధారణ సమావేశం గురువారం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో గరివిడి ఏరియా కో ఆర్డినేటర్ బి.బంగారమ్మ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రతి ఎస్‌హెచ్‌జి, గ్రామ సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండేలా విఒఎలు, సిసిలు పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై అందరూ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఎస్‌హెచ్‌జి బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి ఆసరా, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ సున్నవడ్డీ, వైఎస్ఆర్ బీమా అన్ని సభ్యులకు స్కీముల పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎంలు పి.నారాయణరావు, భారతి, పద్మ, ఎల్‌సి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

భూసార పరీక్షతో రైతులకు లాభం

బొబ్బిలి: భూసార పరీక్షలతో రైతులకు లాభమని వ్యవసాయ శాఖ ఏడి మజ్జి శ్యామసుందరరావు అన్నారు. మెట్టవలసలో మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్‌బికె పరిధిలో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయడంతో రైతులు ఎరువులు ఎలా వినియోగించాలి, ఎంత మోతాదులో ఎరువులు పిచికారీ చేయాలో తెలుస్తుందన్నారు. దీంతో రైతులకు ఎరువుల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. బొబ్బిలి మండలంలో 468, తెర్లాంలో 452, బాడంగిలో 411, రామభద్రపురంలో 376 మట్టి నమూనాలు ఏకరించి భూసార పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. మట్టి నమూనా సేకరణకు రైతులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ

బొబ్బిలి: మున్సిపాలిటీలోని బొబ్బిలి, పాతబొబ్బిలి, గొల్లపల్లిలో జనభాగిదారి ర్యాలీలు నిర్వహించారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం లభ్యం కావడంతో పాటు ఆట, పాటలతో చదువు చెప్తారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు వల్ల కలిగే లాభాలపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అర్బన్ ప్రాజెక్టు నాయకులు కామేశ్వరి, ఉమాగౌరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపేటలో జెవికె కిట్లు పంపిణీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి కొండపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం జెవికె కిట్లు పంపిణీ చేశారు. 3వ వార్డు కౌన్సిలర్ మొయిద శ్రీనివాసరావు ఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి జెవికె కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. దీనిలో భాగంగా ఉచిత విద్య పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బెదిరిస్తే బెదిరిపోయే వ్యక్తిని కాదు..

వేపాడ: తనను బెదిరిస్తే బెదిరిపోయే వ్యక్తిని కాదని టిడిపి నియోజకవర్గం యువత నేత గొంప కృష్ణ అన్నారు. మండలంలోని కొండగంగుబూడిలో ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనది సామాన్యమైన కుటుంబమని తన తల్లిదండ్రులు నేటికీ వ్యవసాయాన్ని నమ్ముకునే ఉన్నారని చెప్పారు. అటువంటి రైతు కుటుంబంలో పుట్టిన తనకు అభివృద్ధి ఎలా చేయాలో తెలిసిన నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. చంద్రబాబు, లోకేష్ ఆదేశం మేరకే గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. తనపై కొంతమంది దుష్ప్రచారాలు చేస్తున్నారని వాటిని తాను పట్టించుకోనని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కొమ్మ భారతి, కొత్తవలస, జామి పార్టీ అధ్యక్షులు గొరపల్లి రాము, లగుడు రవికుమార్, పెదబాబు, రాయవరపు చంద్రశేఖర్, జనపరెడ్డి ఈశ్వరరావు, సేనాపతి గణేష్, సిరికి రమణ, జుత్తాడ రామసత్యం, ఎం గంగరాజు, రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొంప కృష్ణ

డయల్ యువర్ డిఎంకు స్పందన

శృంగవరపుకోట: ఎస్‌కోట ఆర్‌టిసి డిపో పరిధిలోగల వినియోగదారులకు గురువారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఆర్‌టిసి డిఎంకె రమేష్ తెలిపారు. సమస్యలపై ఫోన్ చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన వినతులన్నింటిని ఉన్నత అధికారుల దృష్టిలో పెట్టి సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

పలు గ్రామాల్లో గడప గడపకు..

వేపాడ: మండలంలోని రామస్వామి పేట గ్రామ సచివాలయం పరిధిలోని పికెఆర్ పురం, గడభ వలస గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందాయో లేదని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు రాకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డొగ్గ సత్యవంతుడు, ఎఎంసి చైర్మన్ మూకల కస్తూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, వైసిపి అధ్యక్షులు జగన్నాథం, వైస్ ఎంపిపిలు అడపా ఈశ్వరరావు, ముత్యాలమ్మ మండల జెసిఎస్ ఇంచార్జ్ భోజంకి శ్రీను, సర్పంచులు సనాం అధ్యక్షుడు నిరుజ్జోగి వెంకటరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపై వేధింపుల నివారణకు హెల్ప్‌లైన్

విజయనగరం టౌన్: ఆర్థికంగా, మానసికంగా వేధింపులకు గురవుతున్న వృద్ధులు హెల్ప్ లైన్ 14567ను ఉపయోగించుకోవాలని డిఆర్‌ఓ ప్రసాదరావు అన్నారు. గురువారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం సందర్భంగా ఎంప్లాయీస్ పెన్షనర్స్ యూనియన్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, టి.రామ జోగారావు, ఎస్.తాతారావు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు

రెచ్చిపోతున్న ఇటుక మాఫియా

●రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులకు కాసులు కురిపిస్తున్న ఇటుక బట్టీలు ● చిన్నపాటి కొండలను తలపిస్తున్న మట్టి నిల్వలు ● నిబంధనలు పాటించని యజమానులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కృష్ణాపురం గ్రామానికి వెళ్లే రహదారి పొడవునా ఇటుక బట్టీలే దర్శనమిస్తాయి. పోతనపల్లి, గైరమ్మపేట జంక్షన్, కొట్టం జంక్షన్, మామిడిపల్లి, కాపు సోంపురం, బొడ్డవర, ముసిడిపల్లి తదితర గ్రామాలలో జోరుగా ఇటుక బట్టీల వ్యాపారం సాగుతుంది. ఇటుక లబ్ధిదారులకు ఇటుకల తయారీకి ముఖ్యంగా కావలసిన మట్టి అధికారుల కక్కుర్తి వల్ల సులభంగా లభ్యం కావడంతో మండలంలోని సుమారుగా 50 నుంచి 60 బట్టీలకు పైగానే కొనసాగుతున్నాయి. సంవత్సరం తరబడి బట్టీలవద్ద భారీ మట్టి నిల్వలు ఉన్నప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయితీ గనుల శాఖ అధికారులు ఎవరూ పట్టించుకునే దాఖలాలు లేవు. ఇటుక బట్టీలు పెట్టి వ్యాపారులు కోట్లు దండుకుంటున్నారు. కానీ ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని అధికారుల జేబుల్లో వేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల కక్కుర్తి, గ్రామాలలో నాయకుల పలుకుబడి ఉపయోగించుకొని యాజమాన్లు పంచాయితీలకు పన్నులు కట్టకుండా ఎగనామం పెడుతున్నారు.గృహాల పక్కన, ఆర్ అండ్ బి రోడ్లకు ఇరువైపులా బట్టీలను నిర్వహించకూడదని గతంలో కోర్టు ఆదేశించినప్పటికీ ఇటుక బట్టీల యాజమానులు కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేశారు. ఇటుక బట్టీలు నిర్వహించాలంటే నిబంధనల ప్రకారం ల్యాండ్ కన్వర్షన్ కింద ప్రభుత్వానికి మూడు శాతం పన్ను చెల్లించాలి. జీవో నెంబర్ 80 ప్రకారం ఆర్ అండ్ బి రహదారికి ఇరువైపులా 500 మీటర్ల దూరంలో బట్టీలు ఏర్పాటు చేసుకోవాలి. కాని మండలంలో ఎక్కడ అనుమతులు తీసుకున్న దాఖలాలు లేవు.

మండలంలోని పోతనపల్లి జంక్షన్ వద్ద ఒక క్రిస్టియన్ మిషనరీ స్కూల్, ఒక ప్రైవేట్ స్కూలు ఉండగా వాటికి మూడు వైపులా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. పిల్లలు ఇటుక బట్టీల నుండి వచ్చే దుమ్ము ధూళితో అనారోగ్యానికి గురవుతున్నా తహశీల్దార్ ఇటుక బట్టీల యజమానులపై ఒక్కసారి కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

కొండలను తలపిస్తున్న మట్టి కుప్ప నిల్వలు

ప్రభుత్వానికి గాని గ్రామపంచాయతీలకు గాని ఆదాయం కల్పించాలన్న సంకల్పం అధికారులలో లేకపోవడంతో చాలా గ్రామాలలో ఇటుక బట్టీలకు చెరువుల నుండి మట్టి తీసుకునేందుకు బట్టీల యజమానులకు, ఇరిగేషన్ శాఖ అధికారులకు గ్రామ కార్యదర్శులు, విఆర్ఒలు తొత్తులుగా పనిచేస్తున్నారు. ఇటుక బట్టీల యజమానులు ఒక ట్రాక్టర్ ఇటుక లోడుకు 6 నుంచి 8 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అదే వర్షాకాలంలో అయితే 8 నుండి 10 వేల రూపాయల వరకు వసూలు చేస్తారు. అదే చెరువు నుండి మట్టి లోడుకు క్యూబిక్ మీటర్కు ప్రభుత్వం నిర్ణయించిన ధర చొప్పున చెల్లించాలని ఇటుక బట్టీల యాజమాన్యులకు గాని, వసూలు చేయాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు గాని ఆలోచన లేకపోవడంపై పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటుక బట్టీల వద్ద ఉంచిన మట్టి నిల్వలపై అపరాధ రుసుమును విధించి అనుమతులు లేని ఇటుక బట్టీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పలువురు ఇటుక వినియోగదారులు కోరుతున్నారు.

ఇటుక బట్టీల యాజమాన్యులకు నోటీసులు జారీ చేస్తాం.

మట్టి ఇటుకల తయారీ కోసం చెరువుల నుండి మట్టిని తీసుకునేందుకు ఏ ఒక్క ఇటుకల బట్టి యజమాని అనుమతులు తీసుకోలేదు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గనుక మట్టి పోగుల నిల్వలను పరిశీలించి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం.

ఇరిగేషన్ జెఇఇ సతీష్, శృంగవరపుకోట.

నిబంధనలు పాటించని వారికి చర్యలు తప్పవు

మండలంలోని మట్టి ఇటుకలను తయారు చేస్తున్న వారి వివరాలను సేకరిస్తాం. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇటుక బట్టీల వ్యాపారం సాగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాసరావు, తహశీల్దార్, శృంగవరపుకోట

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నాలు

ప్రజాశక్తి- రాజాం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రాట్యూటీ అమలు చెయ్యాలని, తెలంగాణ కన్నా వేతనాలను పెంపుదల చేయాలని ఇతర సమస్యలు పరిష్కారం చెయ్యాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామమూర్తి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం రాజం ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐసిడిఎస్‌లో 30,40 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు వంటివి ఏ ఒక్కటి కల్పించకుండా నిర్లక్షిణ్యంగా రిటైర్మెంట్ చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను అనేక రెట్లు పెరిగాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదనీ చెప్పారు. అనంతరం సమస్యలతో కూడిన వినతపత్రాన్ని సిడిపిఒకు యూనియన్ అధ్యక్షులు బి.ఉమా కుమారి, రూపవతి, పార్వతి, సునీత, జయలక్ష్మి, భారతి, కుమారి, పుణ్యవతి, సూర్య కళ, లక్ష్మి, అందించారు.

భోగాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలనని ఈ నెల 10,11 తేదీల్లో విజయవాడ కేంద్రంగా జరగనున్న ధర్నా పెద్ద ఎత్తున కార్యకర్తలంతా పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చల సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులకు వినతి పత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి, శ్రీదేవి పాల్గొన్నారు.

కొత్తవలస: ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గజపతినగరం: అంగన్‌వాడీలో అనేక సమస్యలు కొలువై ఉన్నాయని వాటిని పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఆమె ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు పక్క రాష్ట్రం తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు జీతం ఎక్కువ ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. అనంతరం ఐసిడిఎస్ పిఒ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తవలస ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద గురువారం సిఐటియు నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షులు కాకర తులసి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కన్నా అదనంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రాజెక్ట్ ఆఫీసర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : అంగన్వాడీ కేంద్రాలకు నేరుగా రేషన్ బియ్యం పంపించాలని, వంట పాత్రలు, గ్యాస్ పొయ్యిలు ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పార్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు నాయకులు బి.రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిడిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరుగా కేంద్రాలకు ఇవ్వకుండా రేషన్ డిపో నుంచి వచ్చే నెల నుంచి బియ్యం తీసుకోవాలని చెప్పడం సరికాదన్నారు. రేషన్ డిపోకు వెళ్ళి బియ్యం తెచ్చుకోవాలంటే ఖర్చులు ఎవరిస్తారని ప్రశ్నించారు. వంట పాత్రలు, గ్యాస్ పొయ్యిలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ధర్నా అనంతరం సిడిపిఒకు వినతి అందజేశారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య

ప్రజాశక్తి- బొబ్బిలి

కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ విద్యను అందించేందుకు ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. నియోజకవర్గంలో పది, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దేందుకు నాడు-నేడు అమలు చేసి మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: విద్యార్థులు మరింత కృషితో ఆణిముత్యాలు సాధించాలని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు అన్నారు. గురువారం మండలంలోని సతివాడ ప్రభుత్వ ఆధర్శ పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన పదో తరగతి, ఇంటర్ విద్యార్థునులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులు, ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాల ల్లో చదువుతున్న విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వారి భవితకు బాటలు వేస్తుందని తెలిపారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాదించిన ఆయా ప్రభుత్వ పాఠశాలల, కాలేజీల విద్యార్థిని, విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిపి అంబళ్ల సుధారాణి, సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ, నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, మండల పరిషత్ కార్యాలయం ఎఒ కె పుష్పలత, నెల్లిమర్ల, డెంకాడ మండలాల ఎంఇఒ అంబళ్ళ కృష్ణారావు, భోగాపురం, పూసపాటి రేగ ఎంఇఒ రమణ మూర్తి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మలత, ఆయా పాఠశాలల, హెచ్ ఎం తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

శృంగవరపుకోట: రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్య మెరుగుపడిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు నియోజకవర్గస్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను సత్కరిస్తున్నామన్నారు. విద్యార్థులలో పోటీతత్వం అలవర్చడానికి తద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే ఉద్దేశ్యంతో ప్రభుత్వం, జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు చొప్పున నగదు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్స్ వాకాడ రాంబాబు, దమ్ము రమణ, ఎంపిడిఒ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: విద్య వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ప్రోత్సాహక బహుమతులు, ప్రధానోపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో మార్పులకు నాంది పలికిందని దానిలో భాగంగానే నాడు-నేడు ద్వారా పాఠశాల రూపు రేఖలు మారుస్తూ సకల సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

పచ్చని గ్రామాల్లో రాజకీయ చిచ్చు పెట్టొద్దు

●టిడిపి నాయకులకు ఎమ్మెల్యే హితవు ●సర్పంచ్‌ని పరామర్శించిన కడుబండి

ప్రజాశక్తి - జామి

ప్రశాంతతకు నిలయమైన చింతాడ గ్రామంలో టిడిపి రాజకీయ చిచ్చు రేపుతోందని, గ్రామంలోని చిన్న తగాధాను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం తగదని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గురువారం చింతాడ గ్రామ సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యంను ఆయన పరామర్శించి, గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేఖర్లతో మాట్లాడుతూ, సర్పంచ్ సుబ్రమణ్యం విద్యావంతుడు కావడంతో గ్రామాభివృద్ధికి అహర్నిశలు కష్టబడే వ్యక్తి అని కొనియాడారు. పారదర్శకంగా పాలన అందించే సర్పంచుల్లో సుబ్రమణ్యం ముందు వరుసలో ఉంటారని, కానీ కొంత మంది సర్పంచ్ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా చిల్లరి పనులు చేసి, దాన్ని రాజకీయ ప్రాపకం కోసం వాడుకోవడం సరికాదన్నారు. గ్రామంలో పంట నష్టపోయిన రైతు కోసం మాట్లాడుతున్న సర్పంచ్ పై కావాలనే దాడికి దిగడంతో సర్పంచ్‌తో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. అయినప్పటికీ గ్రామం ప్రతిష్ట దెబ్బతినకుండా పోలీసుల వద్దకు వెళ్లకుండా సర్పంచ్ సమన్వయంతో వ్యవహరిస్తే, టిడిపి నాయకులు మాత్రం దాన్ని రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పెద్దలు పెద్ద మనసుతో ఆలోచించి, గ్రామీణ వ్యవస్థ వాతావరణం దెబ్బతినకుండా చూసేందుకు సహకరించాలని కోరారు. వైసిపి మండల కన్వీనర్ రవికుమార్ మాట్లాడుతూ, చింతాడ గ్రామాన్ని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సుబ్రమణ్యం సేవలు ప్రజలను ఆకర్షిస్తున్న నేపథ్యంలో దాన్ని ఓర్వలేక నేర చరిత్ర కలిగిన కొందరు దాడులు చేసి, దాన్ని కప్పిపుచ్చుకునేందుకే రాజకీయ దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆయన్ను పరామర్శించిన వారిలో డిసిసిబి డైరెక్టర్ పి.సంజీవి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కీలారీ సూర్యారావు, ఎంపిపి సబ్బవరపు అరుణ, అన్ని గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తగాదా వివరాలను ఎమ్మెల్యేకు చెబుతున్న సర్పంచ్ సుబ్రమణ్యం

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం నగరంలోనిగాజుల రేగలోని ముత్యాలమ్మ ఆలయం నుంచి జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు వివరాలను తెలియజేస్తూ బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆలయానికి ఎదురుగా ఉన్న సందులో రహదారి సౌకర్యం కల్పించాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కోలగట్ల ఆదేశించారు.

యుపిహెచ్‌సిని ప్రారంభించిన కోలగట్ల

గాజులరేగ ప్రాంతంలో డాక్టర్ వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కోలగట్ల ప్రారంభించారు. కోటి రూపాయలతో ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఒపి గది, వైద్య పరీక్షల గదులను, ల్యాబ్ రూములను అక్కడకు విచ్చేసిన ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మీడియాతో మాట్లాడుతూ గాజులరేగ ప్రాంతంలో మూడు డివిజన్లకు అనుకూలంగా ఉండేలా 10 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామన్నారు. అందుబాటు లోకి వచ్చిన వైద్యంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఇన్‌ఛార్జికమిషనర్ ప్రసాదరావు, డిఎంహెచ్‌ఒ భాస్కరరావు, డిపిఎం సూర్యనారాయణ, ఇఇ కె.శ్రీనివాసరావు, ఎంహెచ్‌ఒ సత్యనారాయణ, నగర అధ్యక్షులు ఆశపు వేణు, కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, జోనల్ ఇన్‌ఛార్జి బోడసింగి ఈశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను స్వామికి చెబుతున్న మహిళ

అందరినీ రెగ్యులర్ చేయాలి

రాజాం: ప్రతిపక్ష నేత హోదాలో జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని చెప్పిన హామీని అమలు చేస్తూ అందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని శాసనసభలోనే ప్రకటించారని నాలుగేళ్లు గడుస్తున్నా ఈ హామీలను నెరవేర్చలేదన్నారు. ఈ రంగంలో పనిచేసిన కార్మికులకు కనీస వేతనాలు కానీ కనీస సౌకర్యాలు గాని సమాన పనికి సమాన వేతనం గానీ అమలు చేయకుండా తీవ్రంగా ప్రభుత్వమే దోపిడీ చేయడం దుర్మార్గమని విమర్శించారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

శృంగవరపుకోట: శ్రీశ్రీ 40వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అధ్యక్షతన శ్రీశ్రీకి గురువారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఒక నూతన ఒరవడిని సృష్టించిన మహనీయుడని, సాహిత్యానికి దశ దిశ నిర్దేశించిన మహాకవి అని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు శ్రీశ్రీ కవితలను చదివి వినిపించారు. తెలుగు శాఖ అధ్యక్షులు రేచర్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మైలురాయిగా నిలిచిపోయే కవి అని, విశాఖ పట్టణం లో 1910లో జన్మించిన శ్రీశ్రీ 16 ఏళ్ళకే ప్రభవ రచన చేశారని, మహాప్రస్థానం, మరో ప్రస్థానం, అల్లూరి సీతారామరాజు చిత్రంలో తెలుగువీర లేవరా అనే పాటతో తెలుగు పాటకి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు.

ఉత్తమ పురస్కారం

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉత్తమ పురస్కారం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ విజయనగరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతి రావు అధ్యక్షతన జరిగిన ప్రపంచ రక్తదాత దినోత్సవ కార్యక్రమంలో రక్తదాన శిబిరాలు నిర్వహణ, సేవా కార్యక్రమాల విభాగంలో ఉత్తమ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎంపికైనట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

నెల్లిమర్ల: రోడ్డు ప్రమాదంలో స్థానిక చాకలి వీధికి చెందిన నారు పెద రాము (58) బుధవారం రాత్రి మృతిత చెందాడు. రోడ్డు దాటుతుండగా విజయనగరం నుంచి గుర్ల వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స కోసం మిమ్స్ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఎస్ఐ నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లద్దాల దుకాణంలో చోరీ

గజపతినగరం : మండల కేంద్రంలోని కళ్లద్దాల దుకాణంలో చోరీ జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం ప్రభుత్వాసుపత్రి రహదారిలో గల కల్లూరి పాలవెల్లికి చెందిన సాయికళ కళ్లద్దాల దుకాణంలో గురువారం తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని దుండగులు షట్టర్ తాళాలు పగలగొట్టి నగదును అపహరించకపోయారు. సమాచారం తెలిసిన వెంటనే గజపతినగరం ఎస్ఐ సిహెచ్ గంగరాజు చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలించారు. అనంతరం పక్క దుకాణంలో గల సిసి ఫుటేజ్ లను పరిశీలించారు. పోలీసుల దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.